

కష్టాల్లోంచి పుట్టిన స్టార్టప్
పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు పిడమర్తి అనిల్‌కుమార్. - 8లో



మాడ వీధిలో టికెట్ కౌంటర్
యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడ వీధిలో ప్రసాదం టికెట్ నూతన కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. - 8లో



న్యాయం ఎక్కడుంటే అక్కడ
న్యాయం, ధర్మం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

43 మంది స్కూల్ అసిస్టెంట్‌ల సర్దుబాటు

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ చేపట్టిన సర్దుబాటు ప్రక్రియలో భాగంగా తొలుత స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)ను సర్దుబాటు చేశారు. 44 మంది స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారంతా గురువారం తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు. ఇక ఎస్‌జీటీల సర్దుబాటు ప్రక్రియ మొదలైంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తొలుత పాఠశాల కాంప్లెక్స్, ఆ తర్వాత మండల స్థాయిలో ఎస్‌జీటీలను సర్దుబాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 60 నుంచి 70 మందిని సర్దుబాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

స్వర్ణగిరీశుడికి తిరుప్పావడ సేవ



స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీవెంకటేశ్వరస్వామి స్వామివారికి గురువారం తిరుప్పావడ సేవ నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి 450 కిలోల అన్న ప్రసాదం, లడ్డూ, వడ, ఇతర పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు.అంతకు ముందు వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర హారతులు సమర్పించారు.

'విదేశీ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్ : విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు 2025–2026 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పథకం కింద ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జినుకల శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు telanganaepass.gov.in ద్వారా ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపకార వేతనాలకు..
2025–26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ వేతనాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి జినుగుల శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు telanganae pass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్‌తో అనుసంధానం ఉన్న బ్యాంక్ ఖాతా వివరాలను దరఖాస్తు ఫారంలో నమోదు చేయాలన్నారు.

గెస్ట్ అధ్యాపక పోస్టులకు..
భువనగిరి: మండలంలోని అనంతారం పరిధిలోని పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, హిందీ, గణితం సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత కలిగిన వారు నెల 26లోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. డిగ్రీ, బీఈడీ, పీజీలో 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9652094994, 9505110024 సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు చివరి తేదీ 31

యాదగిరిగుట్ట: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 31వరకు అవకాశం ఉందని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ కె.శరత్ యామిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో బడి మానేసిన యువతీయువకులు నేరుగా 10వ తరగతి పరీక్షలు రాసేందుకు, ఇంటర్ పూర్తి చేయడానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఈ అవకాశం కల్పిస్తుందన్నారు.

బిల్లులు రావు.. పనులు సాగవు!

సాంకేతిక సమస్యలతో లబ్ధిదారులకు తిప్పలు

- పనిచేయని బ్యాంకు ఖాతాలు
- అప్‌డేట్ కాని ఆధార్ వివరాలు
- గూగుల్ ఫొటోలకూ అవస్థలే..
- బేస్మెంట్ వరకు పూర్తయినా అందని బిల్లులు
- చేతినుంచి ఖర్చు చేయలేక ఇళ్ల నిర్మాణాల నిలిపివేత



ఇతని పేరు ఊర బయ్యన్న. మోత్కూర్‌లోని జంగాల కాలనీలో గల సొంత స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాడు. సొంత నగదు లక్ష రూపాయలతో పాటు మరో రూ.50వేలు అప్పు తెచ్చి బేస్మెంట్ వరకు పూర్తి చేశాడు. బేస్మెంట్ పూర్తై నెల రోజులు అవుతుంది. వారం క్రితం అధికారులు వచ్చి ఫొటోలు తీసుకెళ్లారు. సోమవారం అతని ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. బిల్లు రాకపోవడంతో లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం ఆపేశాడు.

సాక్షి యాదాద్రి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లలో తప్పులు, పేరు మార్పు, యాప్‌లో ఫొటో అప్‌లోడ్ కాకపోవడం తదితర సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఫలితంగా సకాలంలో బిల్లు అందక ఇంటి నిర్మాణానికి ఆటంకంగా మారుతోంది. చాలా చోట్ల బేస్మెంట్ స్థాయిలో పనులు నిలిచిపోయాయి.

సమస్యలు ఇవీ..
ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసే సమయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈ వచ్చి స్థలాన్ని ఐదు రకాలుగా ఫొటోలు తీయాలి. బేస్మెంట్ వరకు పూర్తయిన అనంతరం మరోమారు వచ్చి ఐదు రకాల ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కానీ, ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు ప్లీజ్ నియర్‌బై లొకేషన్ అని వెబ్‌సైట్‌లో చూపుతుంది.

- ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరున మంజూరు చేస్తారు. కానీ, ప్రజాపాలన గ్రామ సభల్లో చాలా మంది పురుషుల పేరున దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మహిళల పేరున మార్చే సమయంలో టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పాటు లబ్ధిదారు పేరు, ఇంటి పేరు, ఆధార్‌కార్డులో అక్షర దోషాల కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎంపీడీఓలు తమ లాగిన్ నుంచి సరిచేసి కలెక్టర్ లాగిన్‌లోకి పంపిస్తారు. తప్పులను సరిచేస్తే సదరు లబ్ధిదారు ఇంటి వివరాలకు సంబంధించిన సమాచారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సెల్‌ఫోన్‌కు వస్తుంది. అప్పుడు కార్యదర్శి మరోసారి బేస్మెంట్ వద్దకు వెళ్లి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో హౌసింగ్ ఏఈ కూడా వచ్చి బేస్మెంట్ కొలతలు తీయాలి. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం జరుగుతుందని నిర్ధారించాలి. ఇంటి నిర్మాణ ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా ప్రతి బుధవారం వరకు అప్‌లోడ్ చేస్తే సోమవారం తర్వాత లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. అయితే గృహ నిర్మాణ శాఖనుంచి బిల్లులు మంజూరు చేసినా క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యల వల్ల నగదు జమ కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.
- ఆధార్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్, బ్యాంకు ఖాతాలోని పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా సమస్య ఏర్పడుతుంది. గతంలో తీసిన కొన్ని జీరో అకౌంట్ నంబర్లు మనుగడలో లేనట్లు చూపుతున్నాయి. ఇక కెనెరా బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకులోఐఎఫ్ఎస్‌సీ కోడ్ సమస్య తలెత్తుతోంది.

పీఎంఏవై యాప్‌లోనూ అప్‌లోడ్ కాని వివరాలు

మంజూరైన ఇళ్లు	9,374
భూమి పూజ చేసినవి	7,088
బేస్మెంట్ దశలో..	1,817
రూఫ్ లెవల్	206
రూఫ్‌కాస్ట్ లెవల్	79
పూర్తయినవి	01
ప్రారంభం కాని గృహాలు	2,286

ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.5లక్షల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. లబ్ధిదారుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి ఐరిష్‌తో వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అనంతరం లబ్ధిదారు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, ప్రభుత్వం అడిగిన పూర్తి వివరాలతో పాటు లబ్ధిదారు ఐరిష్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటితో పాటు ఇందిరమ్మ ఇంటి ఫొటోతోపాటు అంతకుముందు ఎక్కడ నివసించాడనే వివరాలను సైతం అప్‌లోడ్ చేయాలి. అయితే పలువురు లబ్ధిదారులు పాత ఇంటిని తొలగించి ఆ స్థానంలో కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. దీంతో కేంద్రం వైబ్‌సైట్‌లో లబ్ధిదారు వివరాలు అప్‌లోడ్ కావడంలేదు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నది వాస్తవమే. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సుమారు 600 మంది లబ్ధిదారులకు సాంకేతిక సమస్యలు రాగా.. 400 వరకు పరిష్కరించి బిల్లుల కోసం అప్‌లోడ్ చేశాం. మిగతా ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తున్నాం. కేంద్రానికి సంబంధించిన యాప్‌లోనూ ఇళ్ల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నాం. జిల్లాలో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది.

–విజయ్‌సింగ్, హౌసింగ్ పీడీ

బీబీనగర్ పీహెచ్‌సీలో మందుల కొరత

- డీఎంహెచ్‌ఓపై కలెక్టర్ సీరియస్



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఉండడంతో జిల్లా వైద్యాధికారిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వ్యాధులు వ్యాప్తి చెందే సమయంలో మందుల కొరత లేకుండా చూసుకోవాలి కదా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. అదే సమయంలో ఒక పేషెంట్ మందుల చిట్టీతో పీహెచ్‌సీకి వచ్చాడు. ఇక్కడ మందులు లేవు, బయట తీసుకోవాలని సిబ్బంది చెప్పడంతో సదరు రోగి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. కలెక్టర్ స్పందించి.. జిల్లాలో మందుల కొరత లేదని, బీబీనగర్ పీహెచ్‌సీలోనే మందులు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సిబ్బందినుంచి సరైన సమాధానం రాకపోవడంతో డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేశారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలి కదా.. అని సీరియస్ అయ్యారు. అనంతరం నూతన పీహెచ్‌సీ భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లు చెల్లించాలని సూచించారు. అలాగే బీబీనగర్‌లోని ఎరువుల దుకాణం, గోదాంను తనిఖీ చేశారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

రాజాపేట : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతతోనే పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, వ్యాధులు దరి చేరవని స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర అధికారులు వనజ, జుబేదా బేగం పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2025 సర్వేలో భాగంగా గురువారం రాజాపేట మండలంలోని జాల, పాముకుంట గ్రామాల్లో పర్యటించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, తడి, పొడిచెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు మురళి, నాగబాబు, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జమీల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



జాల గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారులు

అక్రమ కేసులకు భయపడం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఆలేరు: బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు పెట్టే అక్రమ కేసులకు భయపడబోమని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆలేరులో నిర్వహించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అనంతరం.. స్థానిక అతిథి గృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను అణచివేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలో భాగంగా పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌తోపాటు నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు. పోలీస్ స్టేషన్లను కాంగ్రెస్ కార్యాలయాలుగా మారుస్తున్నారని విమర్శించారు. అందరికీ ఒకేలా పోలీసులు పనిచేయాలే తప్ప.. వివక్ష చూపడం తగదన్నారు. ఆలేరు సీఐ కొండల్‌రావు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఏజెంట్‌లా పనిచేస్తున్నాడని ఆరోపించారు. పలు భూవివాదాల్లో తలదూరుస్తూ పోలీస్ స్టేషన్‌ను సెటిల్‌మెంట్లకు కేంద్రంగా మార్చుకున్నారని ఆరోపించారు. సీఐ తన వైఖరిని మార్చుకోకపోతే కేటీఆర్, హరీశ్‌రావులతో ఆలేరు పట్టణంలో బహిరంగసభ ఏర్పాటు చేసి వ్యవహారాలన్నీ బయటపెడతామని హెచ్చరించారు. రాజకీయాలు చేయాలను కుంటే సీఐ తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా లేదా.. ఏపదవికైనా పోటీ చేయాలని సూచించారు. అధికారుల వివరాలన్నీ రాసిపెడుతున్నామని, మళ్లీ అధికారంలోకి వస్తామన్న విషయాన్ని వారు గ్రహించాలన్నారు. అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. రైతుబీమాకు ప్రీమియం రూ.900 కోట్లు ఎందుకు చెల్లించడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, మాజీ అధ్యక్షులు మొరిగాడి వెంకటేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు బొట్ల పరమేశ్వర్, పల్లా వెంకట్‌రెడ్డి, నవీన్,హరికృష్ణ,చందు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: పంచ నారసింహులు కొలువైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలను అర్చకులు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఉత్తర దిశలోని ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తరం తదితర పూజలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు





వర్షాలకు రామన్నపేట వద్ద పచ్చగా నిగనిగలాడుతున్న పత్తి చేను

వర్షం.. పత్తి చేలకు జీవం

రామన్నపేట: అదును దాటుతున్నా సరైన వర్షాలు లేక కలవరపడుతున్న కర్షకులకు ఊరట లభించింది. వారం రోజులుగా కురుస్తున్న మోస్తరు వానలు పత్తితో పాటు ఆరుతడికి ప్రాణం పోసినట్లయింది. వాడు దశకు చేరిన చేలు నిగనిగలాడుతున్నాయి.

98వేల ఎకరాల్లో పత్తి సాగు
ఈ ఏడాది జిల్లాలో లక్షా 15 వేల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 98 వేల ఎకరాల్లో సాగైంది. కాగా మే నెలాఖరులో, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు సుమారు 20వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు వేశారు. ఆ తరువాత చినుకు జాడ లేకపోవడం, ఎండ తీవ్రత పెరగడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో ఒక్కో రైతు రెండు, మూడు పర్యాయాలు గింజలు విత్తాల్సి వచ్చింది. అడపాదడపా కురిసిన వర్షాలకు మొలిచిన మొక్కలు సరైన పోషకాలు అందక ఎదుగుదల నిలిచిపోయింది.ఎండతీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో కొన్ని చోట్ల చేలు వాడుపట్టాయి. ఈ తరుణంలో కురుస్తున్న వానల వల్ల చేలకు ప్రాణం పోసినట్లయింది.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం
ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు.
సాళ్లలో విత్తనాలు మొలకెత్తని చోట తిరిగి విత్తడం, కలుపు తీయడం, గుంటుకలు తోలడం, ఎరువులు పెట్టే పనుల్లో బిజీగా ఉన్నారు. ఒక్కసారిగా వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో కూలీల కొరత ఏర్పడింది. మూసీ పరీవాహక ప్రాంతాల నుంచి కూలీలను రైతులు ఆటోల్లో తీసుకెళ్తున్నారు. చార్జీలు కూడా రైతులే భరిస్తున్నారు.

ముసురు, చలి గాలులు

భువనగిరిటౌన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ముసురుతో పాటు చల్లటి గాలులు వీచాయి. గరిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 20 డిగ్రీలుగా నమోదయ్యాయి. నేడు కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



మొలవని చోట విత్తనాలు విత్తుతున్న మహిళలు

తగ్గిన పత్తి సాగు

జిల్లాలో ఈ సంవత్సరం పత్తి సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.1,15,000 ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా 98,000 ఎకరాలకే పరిమితమైంది. వ్యవసాయ శాఖ అంచనా కంటే 17వేల ఎకరాలు తగ్గింది. గత ఏడాదితో పోల్చినా 10 వేల ఎకరాలు తక్కువ సాగైందని అధికారులు చెబుతున్నారు.

వానలు తగ్గాక ఎరువులు పెట్టాలి

గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం కొంత తగ్గింది. సకాలంలో వర్షాలు కురవకపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తితో పాటు ఆరుతడి పంటలకు మేలు చేస్తాయి.మొక్కల మధ్య ఎడం ఉన్న చోట విత్తనాలు విత్తుకోవచ్చు. వానలు తగ్గిన తరువాత ఎరువులు పెట్టాలి.

–నీలిమ, జిల్లా ఇంచార్జ్ వ్యవసాయాధికారి

'డబుల్' ఇళ్లను వినియోగంలోకి తేవాలి

- కలెక్టర్ హనుమంతరావు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : డబుల్ బెడ్ రూం ఇళ్లలో మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డబుల్ బెడ్ రూం ఇళ్లపై సమీక్షించారు. నీటి సరఫరా పైప్‌లైన్లు, విద్యుత్, డ్రెయినేజీతో పాటు చిన్న చిన్న మౌలిక వసతులకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరగా పూర్తి చేసి ఇళ్లను ఉపయోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరీక్షకు ఏర్పాట్లు చేయండి
ఈనెల 27న జరిగే గ్రామ పాలన అధికారుల రెండో స్పెల్ స్క్రీనింగ్ రాత పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. భువనగిరిలోని వెన్నెల కాలేజీ ఆవరణలో గల భువనగిరి కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలో పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్ షాపులు మూసివేయించాలని సూచించారు. సమావేశంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్ మోహన్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

అతివల్లో అక్షర చైతన్యం!

- స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యుల గుర్తింపు
- 29,497 మందికి చదువు చెప్పేందుకు కార్యాచరణ
- ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలు అందజేత
- బోధనకు వలంటీర్ల నియామకం
- త్వరలో తరగతులు ప్రారంభం



యాదగిరిగుట్ట రూరల్: స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకం ద్వారా చేపట్టిన సర్వే ముగిసింది. విద్యాశాఖ, డీఆర్‌డీఓ సంయుక్తంగా చేపట్టిన సర్వే ద్వారా 29,497 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలు అందజేసి, వలంటీర్లను నియమించి అక్షరజ్ఞానం కల్పించనున్నారు. అదే విధంగా వివిధ కారణాల వల్ల చదువు మధ్యలో ఆపేసిన మహిళలను తెలంగాణ ఓపెన్ స్కూల్, ఇంటర్, డిగ్రీ విద్యను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో సంఘాలు, సభ్యులు
జిల్లాలో 14,000 స్వయం సహాయక సంఘాలు, అందులో 1,55,000 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కొందరికి అక్షరాస్యత లేకపోవడం వల్ల సంఘాలు నిర్వహించే లావాదేవీలపై సరైన అవగాహన ఉండటం లేదు. పొదుపుసంఘాల ఆర్థికాభివృద్ధికి రుణాలు, ఇతరత్రా రూపాల్లో తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం.. వారిని అక్షరాస్యతపరంగానూ బలోపేతం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా చదవడం, రాయడం రాని మహిళలను గుర్తించడానికి జూన్ 1నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు సర్వే నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల్లో 29,497 మంది నిరక్షరాస్యులైన మహిళలు ఉన్నారని ఐకేపీ అధికారులు, వీఓఏలు గుర్తించారు. వీరందరి వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు.

వలంటీర్లతో బోధన
నిరక్షరాస్యులకు బోధన చేయడానికి ఆయా గ్రామాల్లోని రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక గ్రూప్ లీడర్లను వలంటీర్లుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. వలంటీర్లకు ప్రత్యేకంగా ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. రోజుకు రెండు గంటలు చొప్పున ప్రణాళిక ప్రకారం ఆయా గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు వీరు బోధన చేస్తారు.

వంద శాతం అక్షరాస్యత లక్ష్యం



స్వయం సహాయక సంఘాల మహిళల్లో 100 శాతం అక్షరాస్యత తీసుకురావాలనే దృక్పథంతో ముందుకెళ్తున్నాం. రాబోయే ఐదు సంవత్సరాల్లో గ్రామాల్లోని సంఘాల్లో నిరక్షరాస్యులు లేకుండా చేయడమే లక్ష్యం. సర్వే ద్వారా గుర్తించిన నిరక్షరాస్య మహిళలకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి.

–నర్సింహారెడ్డి, వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా

నేడు ఏపీఎంలతో సమావేశం

యాదగిరిగుట్ట రూరల్: స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి రూపొందించిన కార్యాచరణలో భాగంగా డీఆర్డీఏ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఏపీఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. నిరక్షరాస్య మహిళలకు అవగాహన కల్పించడం, 100 శాతం అక్షరాస్యత వంటి ప్రధానాంశాలపై ఏపీఎంలకు అధికారులు అవగాహన కల్పించనున్నారు. ఏపీఎంలు తమ మండల పరిధిలోని వీఓఏలు, వలంటీర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండలం కంచనపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి గ్రామానికి చెందిన వడ్డెబోయిన మీనయ్య (60) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాత్రి అక్కడి నుంచి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా..అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గురువారం తెల్లవారుజామున ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వృద్ధురాలు శేషుకుమారి రంగారెడ్డి జిల్లా మల్లాపురంలో తన కొడుకు వద్ద ఉంటోంది. రెండు వారాలకు ఒకసారి భువనగిరికి వచ్చి వెళ్తూ ఉంటుంది. వారం రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన ఆమె నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.11వేల నగదు ఇంట్లో పెట్టి మర్చిపోయి కుమారుడి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ ఉండటం లేదని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. అదే కాలనీలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు రంగారావు, ఎంపిలిగోరి ఇళ్లలో చోరీకి యత్నించగా.. ఏమీ దొరక్కపోవడంతో దొంగలు వెనుదిరిగి వెళ్లారు. గురువారం స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ హౌజింగ్‌బోర్డు కాలనీలోనే మూడు ఇళ్లలో చోరీ జరిగింది.

కష్టాల్లోంచి పుట్టిన స్టార్టప్

గ్రామ పంచాయతీ కార్మికుడి కుమారుడి ప్రతిభ

- దాతల సహకారంతో ఐఐటీలో చేరి స్టార్టప్ కంపెనీ నెలకొల్పిన తుమ్మలపెన్‌పహాడ్ యువకుడు
- నేటి యువతకు స్ఫూర్తిగా పిడమర్తి అనిల్‌కుమార్


అనిల్‌కుమార్

ఆత్మకూర్ (ఎస్): పట్టుదల, అంకితభావం, కష్టపడేతత్వం ఉంటే చాలు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు మారుమూల గ్రామీణ ప్రాంతంలోని కూలీ కుటుంబంలో జన్మించిన యువకుడు. పేద కుటుంబంలో పుట్టినా దాతల సహకారంతో ఐఐటీలో చదివి.. స్టార్టప్ కంపెనీ పెట్టి పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగాడు ఆత్మకూర్ (ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి అనిల్‌కుమార్. బాల్యం నుంచి తల్లిదండ్రుల కష్టాలు చూసి పెరిగిన అనిల్‌కుమార్ అడుగడుగునా ఎదురైన ఆటంకాలను అధిగమించి జీవితంలో సక్సెస్ అయ్యాడు.

ఆత్మకూర్ (ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి ప్రసాద్, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు సునీల్‌కుమార్, అనిల్‌కుమార్ సంతానం. ప్రసాద్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు. కవిత దినసరి కూలీ. వారికి పెద్దగా ఆస్తులు లేవు. అనిల్‌కుమార్ బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద హుజూర్‌నగర్‌లోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో ప్రవేశ పరీక్ష రాసి 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించాడు. పదో తరగతి తర్వాత హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(ఐఐటీ అకాడమీ)లో ప్రవేశ పరీక్ష రాసి ఇంటర్‌తో పాటు ఐఐటీ కోచింగ్ తీసుకునేందుకు సీటు సాధించాడు. ప్రభుత్వ కళాశాలలో ఐఐటీ స్థాయి కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన నాటి గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ స్ఫూర్తితో అనిల్‌కుమార్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సంపాదించాడు. అయితే ఏడాదికి దాదాపు లక్షన్నర రూపాయల ఫీజు చెల్లించాల్సి రావడం ఆ కుటుంబానికి భారంగా మారింది. పైగా అనిల్‌కుమార్ అన్న సునీల్‌కుమార్ కూడా అదే సమయంలో బీటెక్ చదువుకుంటుండడంతో ఇద్దరికి ఫీజు చెల్లించడం వారి తల్లిదండ్రులకు భారంగా మారింది.


గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న అనిల్‌కుమార్


తల్లిదండ్రులు, అన్నతో కలిసి స్నాతకోత్సవంలో పాల్గొన్న పిడమర్తి అనిల్‌కుమార్

దాతల సాయంతో ఐఐటీకి..

ఈ నేపథ్యంలో సాక్షి దినపత్రికలో 2021 డిసెంబర్ 12న అనిల్‌కుమార్ పరిస్థితిపై 'అట్టడుగు నుంచి ఐఐటీకి' అనే కథనం ప్రచురించడంతో దాతలు ముందుకు రావడంతో పాటు అప్పటి సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్, ఇతరుల నుంచి ఆర్థిక సాయం లభించింది. అంతేకాకుండా అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సైతం రూ.2.50లక్షలు చెక్కు అనిల్‌కుమార్‌కు అందించడంతో ఐఐటీలో గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేందుకు దోహదం పడింది. తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకన్న అనిల్‌కుమార్ కష్టపడి చదివి ఈ నెల 15వ తేదీన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన 71వ స్నాతకోత్సవంలో ఇస్రో మాజీ చైర్మన్ ఎస్.సోమనాథ్ చేతులమీదుగా గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నాడు.

కేటీఆర్ మాటలే ప్రేరణగా...

'మనం ఒకరి కింద ఎందుకు పనిచేయాలి..? మనం ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేం..? మనం కంపెనీలను ఎందుకు ప్రారంభించకూడదు..?' అని మాజీ మంత్రి కేటీఆర్ మాటలతో ప్రేరణ పొందిన అనిల్‌కుమార్ ఐఐటీలో చదువుతుండగానే తన మిత్రులతో కలిసి లూప్ ఛార్జింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను స్థాపించాడు. ఈ స్టార్టప్ ద్వారా పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేస్తూ కంపెనీ అభివృద్ధికి పాటుపడుతున్నాడు. అనిల్‌కుమార్ స్టార్టప్ కంపెనీని నెలకొల్పడంతో మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. 'మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని మరికొంతమంది యువకులు స్టార్టప్ కలలను సాకారం చేసుకోవాలని కోరుకుంటున్నాను. మీరు మరిన్ని విజయాలు సాధించాలి. ఉద్యోగ అన్వేషకులుగా కాకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారండి' అని కేటీఆర్ అనిల్‌కుమార్ విజయ ప్రస్థానంపై ఎక్స్(ట్విటర్)లో అభినందనలు తెలిపారు.


ఐఐటీలో చదివేందుకు మాజీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా చెక్కు అందుకుంటున్న అనిల్‌కుమార్ (ఫైల్)

కాంగ్రెస్ రూపొందించింది ముస్లిం రిజర్వేషన్ బిల్లు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప


మాట్లాడుతున్న సంగప్ప

చౌటుప్పల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించింది బీసీ రిజర్వేషన్ బిల్లు కాదని, అది పూర్తిగా ముస్లిం రిజర్వేషన్ బిల్లు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల పేరుతో కేవలం ఒక మతానికి రిజర్వేషన్లు తీసుకురావడానికి బీజేపీ వ్యతిరేకమని పేర్కొన్నారు. 285 సెక్షన్ సవరణ చేసి పంపించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అలా చేయకుండానే గవర్నర్‌కు పంపించిందని ఆరోపించారు. 42శాతం రిజర్వేషన్‌లో 10శాతం ముస్లింలకే దక్కుతుందన్నారు. నిజమైన బీసీలకు కాకుండా మతానికి రిజర్వేషన్లు అందించే కాంగ్రెస్ పన్నాగాన్ని బీసీ సమాజం గుర్తించాలన్నారు. కాంగ్రెస్ కుట్రను బయటపెడుతున్న బీజేపీని కావాలని బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు అన్ని విధాలుగా ప్రాధాన్యత ఇచ్చేది, ఇస్తున్నది కేవలం బీజేపీ మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగపరంగా నిలువవని తెలిసే కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మండల, మున్సిపల్ కమిటీల అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన, మాజీ సర్పంచ్‌లు రమనగోని దీపిక, రిక్కల సుధాకర్‌రెడ్డి, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశం, బత్తుల జంగయ్య, మన్నె ప్రతాపరెడ్డి, ఊడుగు వెంకటేశం, కట్ట కృష్ణ, పిల్ల బుచ్చయ్య, కడారి అయిలయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం


మానస (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన రాధారపు మల్లేశ్, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె మానస(20) డిగ్రీ పూర్తి చేసి భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 20 రోజుల క్రితం చేరి కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటోంది. ప్రతిరోజు ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో పోచంపల్లికి వచ్చి వెళ్తోంది. బుధవారం గ్రామానికి వచ్చే బస్సు రాకపోవడంతో భూదాన్‌పోచంపల్లిలో బైక్ మెకానిక్ పని నేర్చుకుంటున్న తన పెద్దనాన్న కుమారుడు రాధారపు బాలకృష్ణ బైక్‌పై వచ్చింది. తిరిగి రాత్రి ఇంటికి అతడి బైక్ పైనే వెళ్తుండగా.. వంకమామిడి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ పక్క నుంచి నెమ్మదిగా వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పడంతో మానస ఒక్కసారిగా వెనుకకు ఒరగగా, ఆమె తల టిప్పర్‌కు బలంగా తాకడంతో తల పగిలి అక్కడిక్కడే మృతిచెందింది. బాలకృష్ణ బైక్ పైనుంచి కిందపడిపోగా.. అతడి కాలు, చెయ్యి విరిగింది. గాయపడిన బాలకృష్ణ వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పాడు. బాలకృష్ణను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మానస మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగా గురువారం ఇరుపక్షాల పెద్దమనుషులు కూర్చొని మృతురాలి కుటుంబానికి టిప్పర్‌పై ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు రూ.1.65లక్షల పరిహారం ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..


యాసిన్ (ఫైల్)

కనగల్: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండలం దర్వేశిపురం గ్రామ స్టేజీ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చండూరు మండలం బంగారిగడ్డకు చెందిన షేక్ యాసిన్(75), హలీమా దంపతులు 20ఏళ్ల కిందట కనగల్ మండలం దర్వేశిపురం గ్రామానికి వలస వచ్చి గ్రామ స్టేజీ వద్ద మిఠాయి దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గురువారం యాసిన్ తన దుకాణం అవతలి వైపు రోడ్డు దాటుతుండగా.. నల్లగొండ మండలం బుద్ధారం గ్రామానికి చిలుకల అనిల్ ద్విచక్ర వాహనంపై వచ్చి యాసిన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో యాసిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రషీద్‌ఖాన్ తెలిపారు.

యాదగిరి మాడ వీధిలో ప్రసాద టిక్కెట్ కౌంటర్


మాడ వీధిలో సిద్ధమవుతున్న ప్రసాద టిక్కెట్ కౌంటర్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడ వీధిలోని అఖండ దీపారధన పక్కన నూతనంగా ప్రసాద టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.15లక్షలతో 6 టిక్కెట్ కౌంటర్లను 70 గజాల్లో నిర్మాణం చేశారు. ప్రత్యేక గదులు, షెడ్డు, భక్తులు టిక్కెట్ కొనుగోలు చేసేందుకు వీలుగా గ్రిల్స్ సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శివాలయానికి వెళ్లే మెట్ల దారిలో లడ్డూ, పులిహోర ప్రసాద టిక్కెట్ కౌంటర్లను గతంలో ఏర్పాటు చేశారు. భక్తులు మెట్ల మార్గంలో వెళ్లి టిక్కెట్ కొనుగోలు చేసి, తిరిగి మెట్లు ఎక్కి ప్రసాద విక్రయ కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులు స్వామిని దర్శించుకొని నేరుగా అఖండ దీపారాధన పక్కన ఏర్పాటు చేసిన టిక్కెట్ కౌంటర్‌లో లడ్డూ, పులిహోర టిక్కెట్లు కొనుగోలు చేసి అక్కడి నుంచి ప్రసాద విక్రయశాలకు వెళ్లేందుకు వీలు కల్పించారు. ప్రసాదం కొనుగోలు చేసిన భక్తులు పక్కనే ఉన్న శివాలయానికి వెళ్లి, అక్కడి నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు అవకాశాలున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసాద టిక్కెట్ కౌంటర్‌ను శ్రావణమాసం మొదటి రోజు శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు..?

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిసంతోషి జ్యువెలరీ షాపులో ఎనిమిది కిలోల బంగారం చోరీ కేసులో కొంత పురోగతి లభించినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాల ఆధారంగా ఐదుగురు నిందితులను గుర్తించిన పోలీసులు వారిని పట్టుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఐదుగురు నిందితుల్లో ఒకరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పోలీసులకు అతడిచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు నిందితులు నేపాల్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో నిందితులను పట్టుకునేందుకు నేపాల్ సరిహద్దుతో పాటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ సరిహద్దుల్లో పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. చోరీ చేసిన ఐదుగురు దొంగల ముఠాలో ఇద్దరు నేపాల్‌కు చెందిన వారు, మరో ముగ్గురు యూపీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

ముందస్తు ప్లాన్ ప్రకారమే నేపాల్‌కు వెళ్లారా...!

దొంగతనం చేసిన తర్వాత నిందితులు ముందస్తు ప్లాన్ ప్రకారమే బంగారాన్ని నేపాల్‌లో విక్రయించేందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ నిందితుడి ద్వారా మిగతా వారి కూపీ లాగుతున్నారు.

భార్య వేధింపులు భరించలేక భర్త బలవన్మరణం

నల్లగొండ: భార్య వేధింపులు భరించలేక గడ్డి మందు తాగి భర్త మృతిచెందాడు. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం. నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన గంగదారి నరేష్‌కు(39) నాంపల్లి మండలం గట్లుమల్లేపల్లికి చెందిన విజయతో 2014లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు అయాన్, కుమార్తె అభిజ్ఞ సంతానం. గంగదారి నరేష్ నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో కారు మెకానిక్ షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య విజయ తరచూ నరేష్‌తో గొడవపడుతూ ఇష్టమొచ్చినట్లు తిడుతూ మానసికంగా వేధించడంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. భార్య వేధింపులు భరించలేక బుధవారం ఉదయం నరేష్ గడ్డిమందు తాగాడు. అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. నరేష్ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద జరిగింది. రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి పగడాల శ్రీనివాస్‌రెడ్డి(55) బైక్‌పై తుంగపాడు వద్ద జడ్చర్ల–కోదాడ ప్రధాన జాతీయ రహదారి దాటుతుండగా వెనుక నుంచి త్రిపురారం నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ఎగిరి కారుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు పగడాల శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జాతీయ రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో..

పగడాల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. కారు ఓనర్ వచ్చేంత వరకు రాస్తారోకో విరమించమని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో రహదారిపై వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐలు మల్లికంటి లక్ష్మయ్య, సైదులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. కారు మిర్యాలగూడ మండలం అవంతిపురంలోని ఓ మిల్లు ఓనర్‌దని స్థానికులు పేర్కొంటున్నారు.

వాసాలమర్రి శివారులో..

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం వాసాలమర్రి శివారులో గురువారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన పార్వతి భిక్షపతి(35) తుర్కపల్లి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. వాసాలమర్రి కమాన్ వద్దకు రాగానే కొండపూర్ నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భిక్షపతిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తక్కుద్దీన్ తెలిపారు.

ముగిసిన 'నవోదయ' అథ్లెటిక్స్ మీట్


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దవూర: పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్–2025 గురువారంతో ముగిసింది. రాష్ట్రంలోని తొమ్మిది జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 68 మంది బాలురు, 46 మంది బాలికలు కలిపి మొత్తం 114 మంది ఈ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొన్నారు. రన్నింగ్, వాకింగ్, హర్డిల్స్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్ వంటి మొత్తం 21 అథ్లెటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన 25 మంది బాలికలు, 25 మంది బాలురను ఎంపిక చేసి ఈ నెల 27న కర్ణాటక రాష్ట్రం గదక్ జిల్లా మందరాగి జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగే రీజనల్ మీట్‌లో పంపించనున్నట్లు జేఎన్‌వీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శంకర్ తెలిపారు.

కుమారుడి వివాహం కావడం లేదని..

- పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

నల్లగొండ: కుమారుడి వివాహం కావడం లేదని మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామంలో గురువారం జరిగింది. నల్లగొండ రూరల్ ఏఎస్‌ఐ లాజర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషంపల్లి గ్రామానికి చెందిన అప్పాల పాపయ్య(52)కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు కోటేష్ పుట్టుకతో మూగవాడు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. చాలా కాలం నుంచి కోటేష్‌కు వివాహ సంబంధాలు చూస్తున్నారు. మూగవాడనే కారణంతో అతడికి ఎవరూ పిల్లనివ్వడం లేదు. దీంతో పాపయ్య మద్యానికి బానిసయ్యాడు. కుమారుడికి ఎవరూ పిల్లనివ్వడంలేదని మనస్తాపానికి గురైన పాపయ్య బుధవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చాక వాంతులు కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



వరి నాట్లలో మెళకువలు

- కంపాసాగర్ కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు

త్రిపురారం: వానాకాలం సీజన్ ఇప్పటికే ప్రారంభంకావడంతో నీటి సౌకర్యం ఉన్న చోట రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేసుకుంటున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సైతం పైనుంచి వరద వస్తుండడంతో మరికొన్ని రోజుల్లో సాగర్ కాలువకు నీటి విడుదల కూడా చేసే అవకాశం ఉండడంతో ఆయకట్టు పరిధిలో ఇప్పటికే రైతులు నారు పెంపకం చేపట్టారు. వరి నాట్లలో సరైన మెళకువలు, ఎరువుల యాజమాన్యం పాటించాలని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచిస్తున్నారు.

సకాలంలో దుక్కులు, దమ్ము చేసుకోవాలి..

రైతులు ప్రధాన పొలాన్ని సకాలంలో మెత్తగా దుక్కి దున్నుకోవాలి. నీళ్లు పెట్టి దమ్ము కూడా చేసుకోవచ్చు. దీంతో పిచ్చి, కలుపు మొక్కలు పొలంలో కలిసిపోతాయి. తర్వాత పొలంలోని గట్లను సమానంగా సరి చేసుకోవాలి. పచ్చిరొట్ట పైర్లు ముందుగానే సాగు చేసుకున్న రైతులు నాట్లకు 15 రోజుల ముందే దమ్ము చేసుకొని భూమిని చదును చేసుకోవాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి రెండు రోజుల ముందే నీళ్లలో దమ్ము చేసి ఆ తర్వాత నాట్లు వేస్తే మంచిది.

ఎరువుల యాజమాన్యం..



- నత్రజని మూడు సమభాగాలుగా వేసి నాటుకు ముందు దమ్ములో, అంకురం దశలో, బురద పదునులో సమానంగా చల్లుకోవాలి. ఎరువులు చల్లిన 30 గంటల తర్వాత పొలానికి నీరు పెట్టడం ఉత్తమం.
- నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో గాని యూరియా రూపంలో లేదా నానో యూరియా రూపంలో అందించవచ్చు. శాస్త్రవేత్తల సూచనల మేరకు యూరియాను తక్కువగా వినియోగించుకోవాలి.
- 40 కిలోల యూరియా 10 కిలోల వేప పిండి, లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- మట్టి పరీక్షల ఆధారంగా మొత్తం భాస్వరం ఎరువులను దమ్ములోనే వేసుకోవాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేసుకోవాలి. చెల్క నేలల్లో ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా సగభాగాన్ని వేసుకోవాలి.
- కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా దుబ్బు చేసే సమయంలో గాని అంకురం ఏర్పడే దశలో గాని వేయకూడదు. పూర్తిగా దమ్ములో వేసుకోవాలి.
- ముదరు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫారసు కంటే 25 శాతం పెంచి 70 శాతం దమ్ములో, మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలి.

కాలి బాటలు సకాలంలో తీసుకోవాలి.

నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటేనే నాటు త్వరగా కుదురుకుంటుంది. నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. దీర్ఘ, మధ్యకాలిక నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో చదరపు మీటరుకు 40 కదుళ్లు ఉండేవిధంగా చూసుకోవాలి. నాటిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20సె.మీ. కాలి బాటలు తీసుకోవాలి. కాలి బాటల వల్ల వరి పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేసుకోవచ్చు. కలుపు మందులు, ఎరువులు, పురుగు మందులు వేయడానికి అనుకూలంగా ఉంటుంది. పైరు పరిస్థితిని తెలుసుకుంటానికి కాలి బాటలు తోడ్పడతాయి. వరి రకాల కాలపరిమితిని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించుకోవాలి. భూసారం ఎక్కువగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, భూసారం తక్కువగా ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేవిధంగా చూసుకోవాలి. ముదురు నారును నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి 4 నుంచి 5 మొక్కల చొప్పున నాటుకోవాలి.

ఇవి చేయకూడదు.

భాస్వరం ఎరువులతో కలిపి జింక్ సల్ఫేట్‌ను వేయకూడదు. కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. భాస్వరంలో జింకును కలిపి వేయడం వల్ల రసాయనిక చర్య జరిగి పంటకు ఫలితం ఉండదు. జింక్ సల్ఫేట్ ద్రావణంలో సైతం పురుగు, తెగుళ్ల మందులు కలపరాదు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలతో ఎరువులు, చీడపీడల నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమం.